
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 జూన్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ



ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 5/1, 5/2, 6/1, 6/2 స్టోన్ హౌస్ పేట పప్పుల వీధిలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. సచివాలయాలలోని ఇన్‌స్పెక్షన్ రిజిస్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిస్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అమెనిటీస్ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం స్థానిక పప్పుల వీధి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వీధిలో స్పందన ఫిర్యాదును అధికారులతో కలిసి పరిశీలించారు. నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడి బక్కచిక్కింది.. ధర బరువెక్కింది..!

- ఉష్ణోగ్రత ఎఫెక్ట్ ○కేజీ రూ.328 ○బోన్‌లెస్ రూ.600
- భారీగా పెరిగిన మాంస పదార్థాల ధరలు
- లబోదిబోమంటున్న వినియోగదారులు, హోటల్ యజమానులు

ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఫలితంగా కోడి ధరలు భారీగా పెరిగి పోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో కోడి మాంసం ధరలు ఉన్నాయి. ఉష్ణోగ్రతల కారణంగా కోడి ఎదుగుదల లేకపోవడం, ఎక్కువ చనిపోవడంతో వ్యాపారులు నష్టపోతున్నారనే సాకుతూ ధరలు ఒక్కసారిగా అమాంతంగా పెంచేశారు. కేజీ బాయిలర్ మాంసం ధర రూ.296, స్కిన్‌లెస్ మాంసం రూ.328, బోన్‌లెస్ ధర రూ.600 ఈ ధరలు చూసిన జనం గగ్గోలు పెడుతున్నారు. మాంసం ప్రియులు కోడి జోలికి వెళ్లడం లేదు. పెరిగిన ధరలతో హోటల్ యజమానులు మాంసం పదార్థాలు పెట్టలేక పోతున్నామంటూ ధరలు పెంచుతున్నారు. వేసవి కారణంగా కోడి బక్కచిక్కింది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వేసవి అన్ని రంగాల్లో తీవ్ర ప్రభావం చూపింది. అందులో పౌల్ట్రీ పరిశ్రమ నష్టాలతోపాటు, వినియోగదారులకు ఇబ్బందులు మిగిల్చింది. రాష్ట్ర వ్యాపితంగా మార్చి, ఏప్రిల్, మేలలో గతం కంటే భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతంలో 35 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలుండేవి. ఇప్పుడు అవి 35 నుంచి 45 వరకు పెరిగాయి. పెరగడంతో పాటు ఎక్కువ రోజులు ఉండడంతో తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. జూన్‌లో కూడా వర్షాలు రాకపోగ, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితంగా పౌల్ట్రీ పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటుంది. గతంలో పెంచిన పిల్లల్లో ఎక్కువ శాతం పెరిగి పెద్దవి అయ్యేవి. వేసవి కారణంగా ఎక్కువ కోళ్ళ చనిపో తున్నట్లు తెలుస్తోంది. గతంలో 30 నుంచి 40 రోజులకు కోడి 2నుంచి 2.5 కేజీల వరకు బరువు ఉండేది. ప్రస్తుతం ఎండలు కారణంగా కోడి బక్కచిక్కి పోయింది. ప్రస్తుతం 50 రోజులకు కూడా కోడి 1.50 కేజీలు మాత్రమే ఉండడంతో ఎదుగుదల లేదు. అన్ని మాంసాల్లో సామాన్యునికి ఒక్క చికెన్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. గతంలో రూ.150 నుంచి రూ.250 వరకు ఉండేది. సామాన్యులకు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఒక్కసారిగా ధరలు పెరగడంతో కోడి మాంసం ప్రియంగా మారింది. నెల్లూరు జిల్లాకు విజయవాడ, చిత్తూరు, కృష్ణగిరి, గంగాధర్ నెల్లూరు, కోలార్ నుండి కోళ్ల సరఫరా జరుగుతోంది. నెల్లూరు నగరం, చుట్టుపక్కలకు ప్రతి రోజూ 50 వేల కోళ్లు సరఫరా అవుతున్నాయి. సుమారు 80 నుంచి లక్ష కేజీల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. జిల్లా వ్యాపితంగా లక్ష కోళ్ళ, సుమారు 1.50 కేజీల మాంసం క్రయ విక్రయాలు సాగుతున్నాయి. వర్షాలు కురిస్తే, చల్లబడిన తరువాత కోళ్ళ కాస్త బరువు పెరిగే అవకాశాలున్నట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. వెంకాబ్, సుగుణ, ఇతర బడా కంపెనీలు సైతం ఏమీ చేయలేని పరిస్థితులున్నాయి. విజయవాడ, చిత్తూరు ప్రాంతాల్లో కోడి ధర రూ. 158 నుంచి రూ.160 వరకు ఉంది. ఇక్కడకు వచ్చే సరికి కోడి కేజీ రూ.175 పడుతోంది. దీనికి రూ.10 ట్రాన్స్‌పోర్టు ఖర్చు అవుతోంది. వ్యాపారులకు నష్టపోతున్నారు. వినియోగదారులు నచ్చితే తింటారు,. లేదంటే లేదు. నెలకు మాంసానికి ఇంతని బడ్జెట్ కేటాయిస్తారు.





ప్రస్తుతం కోడి మాంసం వినియోగం 25 శాతం తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. కోడి చిన్నవిగా ఉండడంతో రుచిగా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కోడి 1.300 నుంచి రెండు కేజీల వరకే ఉంటుంది. కోడి బరువు పెరగకపోవడం, అందుకు అనుగుణంగా ధరలు లేకపోవడంతో కంపెనీలు నష్టం వస్తుందనే ఉద్దేశంతో ఒకేసారి భారీగా కోడి మాంసం ధరలు పెంచారు. సామాన్యులకు కోడి కూర దూరమైంది.

వ్యాపారులు లబోదిబో..!

ఒకేసారి కోడి మాంసం ధరలు భారీగా పెరగడంతో వ్యాపారులు లబోదిబో అంటున్నారు. వినియో గదారులు మాత్రం కోడి జోలికి వెళ్లకపోవడంతో కొన్ని షాపులు మూసేకుంటున్నారు. శనివారం నెల్లూరు మార్కెట్లో బాయిలర్ మాంసం కేజీ రూ.296, స్కిన్‌లెస్ రూ.328, బోన్‌లెస్ రూ.600 వరకు పలుకుతుంది. ఇది పెరిగిన వెంటనే చికెన్: ఊరగాయి కేజీ రూ.1200 చేశారు. చికెన్ పకోడ షాపులు ధరలు పెంచారు. హోటళ్లు ప్రస్తుతం ఉన్న ధరలకు బిర్యానీలు, కోడి మాంసంతో ఉంటే పదార్థాలు పాత ధరలకు ఇవ్వలేక, అదే తరలకు ఇస్తే క్వాంటిటీ తగ్గించి ఇస్తున్నారు. వర్షాలు, పడితే కోడి మళ్లీ బరువెక్కుతుందని చెబుతున్నారు. అప్పటి వరకు మాంసం కొంత ప్రియం కానుంది.

సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

నెల్లూరు : స్థానిక 29వ డివిజన్‌లోని మహాత్మాగాంధీనగర్, వెంకటరెడ్డినగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్ తదితర ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలంటూ స్థానిక టిడిపి నాయకులు నిరసన చేపట్టారు. శనివారం నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు మహాత్మాగాంధీనగర్, వెంకటరెడ్డి నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్ ప్రాంత ప్రజలు, టిడిపి నాయకులుతో కలిసి నెల్లూరు పార్లమెంట్ కార్యదర్శి కనపర్తి గంగాధర్,డివిజన్ అధ్యక్ష్యులు గుద్దేటి.చెంచయ్య, నెల్లూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ అస్లాం నిరసన చేపట్టారు. మాట్లాడారు. షేక్.ఖదీర్, పోలూరు సుధాకర్, సయ్యద్ దావూద్, బొడ్డుబోయిన కష్ణ,షేక్ మస్తాన్ బి,షేక్ షాజహాన్, షేక్ మౌలాలి, పెనుబర్తి శివ సాయి పఠాన్ సల్మాన్ ఖాన్ ఉన్నారు.

అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలు

పాదయాత్రలో లోకేష్ హామీ - వెంకటగిరి నియోజకవర్గంలో 16 కిలోమీటర్ల యాత్ర

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వస్తే 20లక్షల మంది ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం 130వ రోజు పాద యాత్ర వెంకటగిరి నియోజక వర్గంలోని కల్లూరు క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమైంది. అంతకముందు గిరిజనులు, యువకులు, ముస్లిములతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అక్కడి నుంచి మాదన్నగారి పాళెం, చింతలపాళెం, వెంకట్రామరాజుపేట, ఉయ్యాలపల్లి, కొట్లూరుపల్లి, తెగచర్ల గ్రామాల్లో లోకేష్ పాదయాత్ర జరిగింది.అడుగడుగున ప్రజలు ఘన స్వాగతం పలికారు. శనివారం ఒక్క రోజే 16కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. 130వ రోజుకి 1654కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. పెనుబర్తి శివారులో విడిది కేంద్రంకు చేరుకున్నారు. పలుచోట్ల జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టిలను మోసం చేశారని విమర్శించారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, కరెంటు సౌకర్యాలు లేకుండా ఈ ప్రభుత్వం చేసిందన్నారు. 45సంవత్సరాలు నిండిన మహిళకు ఫించన్ ఇస్తామని మోసం చేశారన్నారు. ఐటిడిఎ ఏర్పాటు చేసిన ఘనత టిడిపిదేనన్నారు. తాము అధికారంలోకి వస్తే 18సంవత్సరాలు నిండిన మహిళకు ప్రతినెలా రూ.1500లు ఇస్తామని, ఐదేళ్లలో రూ.90వేలు అవుతుం దన్నారు. ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం, మూడు సిలిండర్లు, తల్లికి వందనం కార్యక్రమాల ద్వారా ఇద్దరు పిల్లలకు రూ.30వేలు చొప్పున ఇస్తామన్నారు. గత టిడిపి పాలనలో 6లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, తాము అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామన్నారు. లోకేష్‌కు అడుగడుగున యువకులు, మహిళలు, వృద్ధులు వినతిపత్రాలు అందజేశారు. జెసిబిలతో గజమాల వేశారు. పాద యాత్రలో వెంకటగిరి మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్, ఆనం అనుచరులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

అఖిలపక్ష నాయకుల డిమాండ్



అభివాదం చేస్తున్న అఖిలపక్షాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

అగ్రిగోల్ బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సి ఒదేనని పలువురు అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కెపిఆర్ కళ్యాణ మండపంలో అగ్రి గోల్డ్ బాధితులకు సత్వరమే డబ్బులు చెల్లించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజా, సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత 9 ఏళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులు అన్నిరకాలుగా నష్టపోయారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని చేసిన హామీని విస్మరిం చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలవాలన్నారు. లేనిపక్షంలో అగ్రిగోల్డ్ బాధితులు చేసే ప్రతి పోరాటంలో నేను ఎప్పుడూ వారికీ అండగా నిలుస్తా న్నానారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటే శ్వరు మాట్లా డుతూ గడిచిన తొమ్మిదేళ్ల నుంచి అగ్రి గోల్డు బాధితులు ప్రభుత్వాలు తమకు న్యాయం చేస్తాయని ఎదురు చూస్తున్నారన్నారు. నేటికి రాష్ట్ర వ్యాప్తంగా రూ.30 కోట్ల 80 లక్షల మేరకు బకాయిలున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రీ గోల్డు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికి అగ్రిగోల్డు బాధితుల వైపు చూడకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆగస్టు నుంచి ఆందోళనలు చేస్తామన్నారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో ఆ సంస్థ ఆస్తులు వేలం వేయటం ద్వారా వచ్చిన నగదును, అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించేందుకు టిడిపి ప్రభుత్వం కేటాయించిన నగదును అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కొంత మందికి అందజేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఇంకా సిపిఐ, కాంగ్రెస్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు : బాపట్ల జిల్లాలో బాలుడిన పెట్రోల్ పోసి తగలబెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమర్నాధ్ అనే 10వ తరగతి బాలుడు తన సోదరిని వైసిపికి చెందిన వెంకటేశ్వర రెడ్డి ప్రతిరోజు వేధిస్తూ అవమానిస్తుంటే భరించలేని ఉప్పాల అమరనాథ్ వెంకటేశ్వర రెడ్డిని ప్రశ్నించారన్నారు. ఇది భరించలేని వెంకటేశ్వరరెడ్డి దారికాచి కాళ్లు చేతులు కట్టేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన వైసిపి కార్యకర్తలు వెంకటేశ్వర రెడ్డి , గోపిరెడ్డి , వీరబాబు , సాంబిరెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. కఠినంగా శిక్షించాలన్నారు. అమరనాథ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ప్రాంత ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ఎంఎల్ఎ మాను గుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షణలో నిర్మితమవుతున్న అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి సంతనూతలపాడు కు చెందిన పెరుగు వాసు. భార్య సుజాత. కుమార్తెలు సాయి గౌతమి. శివతేజ లు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో కమిటీ సభ్యులు వెంకటరెడ్డికి లక్ష రూపాయలు అందజేశారు ఈ కార్యక్రమంలో సూరం వేణుగోపాల రెడ్డి ఉన్నారు

యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మూవీ ఫ్యాక్టరీ బ్యానర్‌పై దర్శకుడు సల్మాన్ దర్శకత్వంలో నిర్మించిన జస్టిస్ మూవీ యూట్యూబ్ ఛానల్‌ను ఎంఎల్ఎ మాను గుంట మహీధర్ రెడ్డి శనివారం వైసిపి కార్యాలయంలో ప్రారంభించారు. మహీధర్ రెడ్డి మాట్లాడుతూ మంచి సినిమాలు చేసే ప్రజలు ఆదరిస్తారన్నారు. కందుకూరు పరిసర ప్రాంతంలో జస్టిస్ సినిమాను నిర్మించి కందుకూరు ప్రాంతానికి మంచి పేరు తెచ్చారని దర్శకుడు సల్మాన్ ని సన్మానించి, జస్టిస్ టీమ్ ను అభినందించారు. సినీ నటుడు, నిర్మాత చీదెళ్ల వేణుగోపాలరావు మాట్లాడుతూ జస్టిస్ సినిమా యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించిన శాసన సభ్యులకు, సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. జస్టిస్ చిత్ర యూనిట్ సభ్యులు,సూరం వేణుగోపాల్ రెడ్డి, పబ్బిశెట్టి శివ, చక్కా వెంకట కేశవరావు, షేక్ రహీం పాల్గొన్నారు.



ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ముగిసిన ఎన్ఎస్ఎస్ శిక్షణ తరగతులు విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ సహకారంతో విద్యార్థులలో నైపుణ్యాభివద్ధి పెంపొందించడంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి రోజు ప్రొఫెసర్ డేవిడ్‌పాల్ ఆన్‌లైన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య పి రామచంద్రా రెడ్డి, విఎస్‌క్షీఉ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి విజయ ఆనంద కుమార్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని వారికి సర్టిఫికేట్ ప్రధానం చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 26 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులను నగదు ప్రోత్సాహకాలతో అభినందించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు జిల్లాస్థాయి కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ హరి నారాయణన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై వారిచేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు.


19న కలెక్టరేట్ ఎదుట చేనేతల ధర్నా



ప్రజాశక్తి-నెల్లూరు : చేనేత కార్మికులు తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహి స్తున్నట్లు చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చేనేత సమస్యల పరిష్కారం కోసం, ఆప్కో స్థలం పరిరక్షణ కోసం,జిఎస్ రద్దు, 11రకాల రిజర్వేషన్ కట్టు దిట్టంగా ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఈ ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో చేనేతలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని నెల్లూరు మన హాస్పిటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. జాతీయ చేనేత సంక్షేమ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి బూదాటి రాధాకష్ణయ్య మాట్లాడుతూ నగరంలోని గాంధీ నగర్ లో ఉన్న ఆప్కో స్థలం 6ఎకరాలు 90 సెంట్లు చేనేతకే ఉండాలని, ఇతరులకు కేటాయించినటువంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదివేటు వంటి విద్యార్థు లకు చేనేత బట్టలను ఇవ్వాలని, మాస్టర్ వీవర్స్ దగ్గర, సహకార రంగాల వద్ద నిల్వ ఉన్న బట్టలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, నేతన్న నేస్తం ప్రతి చేనేత కార్మికునికి, ఉపవత్తుల వారికి ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు పముజుల హరి, జాతీయ చేనేత సంక్షేమ ఐక్య వేదిక నాయకులు డి. కోటేశ్వరరావు, కన్నా కమలాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరభ్యాసం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని పోకూరులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అక్షరభ్యాసం జరిగింది. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఒకటో సెక్టారు పర్యవేక్షకురాలు లలిత పాల్గొని మాట్లాడారు. చిన్నపిల్లలకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు తీయించుకోవాలని తల్లులకు సూచించారు. పుట్టిన తేది సర్టిఫికేట్లు కూడా తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రీస్కూలు విద్యను ప్రభుత్వం అందిస్తుం దన్నారు. అదేవిధంగా గర్భవతులు, బాలింతలకు పోష కాహారం సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి గర్భవతులతో మాట్లాడారు. పలువురికి పుట్టిన తేది సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్త సరస్వతి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.



డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శని వారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలో మొత్తం 8,707 మంది విద్యార్థులకు గానూ 8,133 మంది హాజరయ్యారు.



ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు

స్వచ్ఛందంగా నగరంలోని పొదలకూరు రోడ్డులో గల విభిన్న ప్రతిభావంతుల బాలిక వసతి గృహానికి త్రాగునీటి ఆర్.ఓ సిస్టంను డొనేట్ చేయడం పట్ల కలెక్టర్ ఎం హరి నారాయణన్, మోడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్ రెడ్డి ని అభినందించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆర్.ఓ ప్లాంట్ ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని మోడరన్ స్కూల్ కరస్పాండెంటు వాకాటి విజయకుమార్ రెడ్డి, తన తల్లిదండ్రులు వాకాటి పెంచాలరెడ్డి, వాకాటి రాధమ్మ ల జ్ఞాపకార్థము రూ. 70 వేల విలువ గల తాగునీటి ఆర్.ఓ సిస్టంను, స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్ ప్లేట్స్, స్టీల్ గ్లాసులను నగరంలోని విభిన్న ప్రతిభావంతుల బాలిక వసతి గహానికి అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు అక్బర్ ఆలీ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పెంచలరెడ్డి, వసతి గహం వార్డెన్ కస్తురి పాల్గొన్నారు.

'మాలకొండ'లో కలెక్టర్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి శనివారం ప్రకాశం జిల్లా కలక్టర్ దినేష్‌కుమార్ కుటుంబ సమేతంగా వచ్చారు. వారితో పాటు కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక ఉన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కెబి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక దర్శనంతో పాటు పూజలు చేయించారు. అదేవిధంగా భక్తుల నుండి వివిధ రూపాల్లో రూ. 9,13,925 ఆదాయం లభించినట్లు అధికారులు వివరించారు. ఎండను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అవసరమైన వసతులు కల్పించారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం అన్నదాన వసతి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

మున్సిపల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : తమకు ఉద్యోగ భద్రత కల్పించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులకు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వెహికల్ షెడ్ ఎదట కార్పొరేషన్‌లో డ్రైవర్లుగా పనిచేస్తున్న వారు ధర్నా చేపట్టారు. సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధి నిర్వహణలో పాల్గొన్న కార్మికులను ప్రభుత్వం కరోనా వారియర్స్‌గా ప్రకటించినప్పటికీ, వారిపట్ల నిర్లక్ష్యధోరణి అవలంభిస్తూ మొండి చేయి చూపించిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మున్సిపల్ కార్మికులకు చేసిన హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రభుత్వం ప్రకటించాల్సిన అవసరముందన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఆర్ఎం సునీల్ కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని ప్రతిపక్ష నేతగా నాడు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌర వాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం అశోక్, డ్రైవర్స్ యూనియన్ నాయకులు రమేష్, జయకుమార్, నాగేశ్వరరావు, మనోజ్, శ్రీనివాసులు, లోకేష్,బ్రహ్మయ్య, పవన్ పాల్గొన్నారు.

చర్మ వ్యాధుల నివారణకు వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారి కోసం నారాయణ వైద్యశాలలో ఈ నెల 19వ తేది నుంచి జూలై 18వ తేది వరకు ఉచిత చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నారాయణ వైద్యశాలలో తన ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. అవాంఛిత రోమాలు, టాటూస్ తొలగించడం, మచ్చలు తగ్గించేందుకు లేజర్ చికిత్సలపై, ముఖవర్చస్సు, మంగు, ఇతర మచ్చల కొరకు చేసే కెమికల్ పీల్స్ పై, మాడు పై ఎంట్రుకల పెరుగుదలకు పిఆర్పి తదితర చికిత్సలపై ప్రత్యేక రాయితీ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.వివరాలకు 9640100555/7331170063 నెంబర్లకు సంప్రదించాలన్నారు. నారాయణ హాస్పిటల్ చర్మ వ్యాధుల విభాగం వైద్యులు షేక్, షబానా, డాక్టర్ ఉదయ్ కిరణ్ ఉన్నారు.

నేడు చలపతి, చెంచయ్య వర్ధంతి

ప్రజాశక్తి-నెల్లూరు

గోను చలపతి, మేకల చెంచయ్యల 26వ వర్ధంతి కార్యక్రమం భక్తవత్సలనగర్, నక్కలగుంట ప్రాంతంలో నిర్వహించనున్నార. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, నగర, రూరల్ కమిటీ సభ్యులు, స్థానిక శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల కార్యకర్తలు, నాయకులందరూ హాజరై జయప్రదం చేయవలసిందిగా సిపిఎం రూరల్ కమిటీ పిలుపు నిచ్చింది. ఉమ్మారెడ్డి గుంట, నక్కలగుంట, బీవీ నగర్ తదితర ప్రాంతాల్లో పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలపై నిత్యం పోరాడుతూ మంచి గుర్తింపు పొందుతున్న గోను చలపతి, మేకల చెంచయ్య లను చూసి ఓర్వలేక బిజెపి కిరాయి గుండాలు 26 ఏళ్ల కిందట దారుణంగా హత్య చేశారన్నారు.

24న విట్స్‌లో అంతర్జాతీయ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలోని విబిఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జూన్ 24న "రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్" అనే అంశంపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగవతుల దత్తాత్రేయ శర్మ, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ ఆర్.ప్రవీణ్, కో-కన్వీనర్స్ డాక్టర్ రాజేష్, డాక్టర్ వెంకటేశ్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుండి దాదాపు 100కు పైగా పేపర్లు ఈ కాన్ఫరెన్స్‌కు రానున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ ముఖ్య అతిథిగా తిరుపతి ఐఐటి నుండి డాక్టర్ విక్రమ్‌కుమార్ విచ్చేస్తున్నారని, ముఖ్య వక్తగా వెల్లూరు విఐటి నుండి డాక్టర్ విజయేంద్ర బాబు విచ్చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు.

కేన్సర్ చికిత్సకు శిబిరం



ప్రజాశక్తి-కావలి : "గ్రేస్ ఫౌండేషన్" వారి ఆధ్వర్యంలో గవర్నమెంట్ వారి సహాయంతో కావలి ఏరియా హాస్పిటల్ ఆవరణంలో ఉచిత కేన్సర్ వైద్య శిబిరం, స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ డానియల్, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పెంచలయ్య, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ బ్రిజిత, నిర్మలాదేవి డిస్ట్రిక్ట్ మైనారిటీ ఆఫీసర్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మావతి, కావలి మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ ఉచిత శిబిరంలో 480 జనరల్ ఒపి నమోదు కాగా 185 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రేస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కావలిలో కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఎంతో ఖర్చుతో కూడిన ఈ వైద్యాన్ని ఉచితంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వారి సేవలు ఉపయోగించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల గానూ శ్రీ స్వామి వారి అమ్మవార్ల హుండీ ఆదాయం రూ.19,74,061 వచ్చిందని, ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కోవూరు పరిశీలకులు చైతన్య, ధర్మకర్తల మండలి సభ్యులు – ఒట్టూరు. మాల్యాద్రి, ఆరవ.తులసిరామ్, కోర్ పోతి. ఓబుల్ రెడ్డి గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-జలదంకి : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తహశీల్దార్ సిహెచ్ పద్మావతి అన్నారు. శనివారం జమ్మలపాలెంలో సర్పంచ్ బుర్రి శ్రీవేణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తుల నుండి 30 అర్జీలు వచ్చాయని, త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామంటూ గ్రామస్తులకు తహశీల్దార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, ఏఆర్ఓ రమణయ్య, వీఆర్వోలు మల్లికార్జున, నవీన్, అరుణకుమారి, మహేశ్వరి, వీఏఎ సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జెబి'లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : 2023–24 విద్యాసంవత్సరానికి గాను కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో 19వ తేదీ నుండి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ.రాజగోపాల్ రెడ్డి శనివారం ప్రకటనలో కోరారు. కావున విద్యార్థులు కళాశాలకు వచ్చి, అడ్మిషన్లు పొందవలసిందిగా కోరారు. ఈ విద్యాసంవత్సరం నుండి డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా కొత్త విద్యావిధానం ఉన్నత విద్యాశాఖ ప్రవేశపెట్టిందని, ఈ మార్పులు గమనించి కావలిలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూచించారు.

జెడ్‌పిటిసి మోడీకి అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి మీడియా పాయింట్‌కు జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు విలేకరులపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆయనకు అభినందనలు తెలిపారు. శనివారం మీడియా పాయింట్‌కు జెడ్‌పిటిసి సభ్యులు మోడీ రామాంజనేయులు పది కుర్చీలు కూలింగ్ వాటర్ క్యాన్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా మిత్రులతో మాట్లాడుతూ మీడియా పాయింట్‌కు అవసరమైన సదుపాయాలకు తనవంతు సహకారం ఉంటుందని హామీనిచ్చారు. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

'జగనన్న సురక్ష' పథకంపై సమీక్ష



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని అల్లంపాడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై శనివారం పంచాయతీ కార్యదర్శి గుంటా కిషోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంటిలోని కుటుంబ సభ్యులకు కావాల్సిన, రావాల్సిన కుల, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటి పది రకాల ధ్రువీకరణ పత్రాలను పొందాల్సిన ఏవైనా ఉంటే ప్రజల దగ్గర నుండి వివరాలు స్వీకరించి వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను 'షెడ్యూల్' ప్రకారం సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి ధ్రువీకరణ పత్రాలను అందించడమే జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్ షేక్ మౌలాలి, సర్పంచ్ అన్నపరెడ్డి కృష్ణారెడ్డి, గృహ సారథులు, గువ్వల వెంగారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి కనకదుర్గ భవాని అన్నారు. బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జగనన్న సురక్ష సమావేశంలో పాల్గొని పంచాయతీ కార్యదర్శులకు విలేజ్ రెవెన్యూ అధికారులకు ఇతర సచివాలయ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎంపిడిఒ, తహశీల్దార్ రెండు టీములుగా ఏర్పడి జూలై 1 నుండి ప్రతి సచివాలయాన్ని సందర్శించి అక్కడికక్కడే ప్రజలకు అవసరమైన కొన్ని సర్టిఫికెట్లు మంజూరు చేస్తారన్నారు. ఎంపిడిఒ వెంకటసుబ్బారావు, తహశీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఇంటికి అవసరమైన సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారాలు కూడా సిద్ధం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జగనన్న సురక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీదేవి, ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర, నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ విచ్చేసి ప్రభుత్వం చేపట్టనున్న పలు అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 4సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ పథకం ప్రవేశపెట్టారని తెలియజేశారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

23 నుండి 'జగనన్న సురక్ష'



ప్రజాశక్తి-ఉదయగిరి : జూన్ 23 నుండి జూలై 23వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, వెల్ఫర్ అసిస్టెంట్లకు జగనన్న సురక్ష పై ఎంపిడిఒ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నవరత్నాల కార్యక్రమాలలో భాగంగా ఇంకా అందని అర్హులను గుర్తించడంతో పాటు వారికి అర్హత ఉండి ఇప్పటికీ అర్హత పత్రాలు మంజూరు అర్హులైన వారికి ఆగస్టు 1న లబ్ధి చేకూర్చేలా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయాల్లో సర్వీసుల అర్జీలకు 100 శాతం అందేలా రెండు బృందాలుగా ఎంపిడిఒ, తహశీల్దార్ ప్రతి సచివాలయాలను సందర్శించడం జరుగుతుందన్నారు. అధికారుల సందర్శనకు ముందుగానే వలంటీర్లు వారికి కేటాయించిన ప్రతి ఒక్క గృహాన్ని సందర్శించి వారికి అవసరం అగు సర్టిఫికెట్లు ఇంకనూ రావాల్సి ఉన్న పథకాలకు సంబంధించి అర్హత పరిశీలన, పౌరులకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటికి సంబంధించిన డాక్యుమెంట్ వలంటీర్లు ఆయా కుటుంబాల నుండి సేకరించి సచివాలయంలో పర్యవసానం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై జెసికి ఫిర్యాదు

ప్రజాశక్తి-కావలి

కావలిలో గ్రావెల్ అక్రమ తరలిపంపుపై చర్యలు తీసుకోవాలని శనివారం జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తరలింపు గురించి కూలంకషంగా వివరించారు. కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలోని చౌటపుత్తేడు, దామవరం (ప్రతిపాదించబడిన విమానాశ్రయ ప్రాంతం), బోగోలు మండలంలోని తిప్ప పోలీస్ స్టేషన్ సమీపంలో, కావలి మండలంలోని రుద్రకోటచెరువు, కొండ ప్రయివేట్ భూమి, కొత్తపల్లి చెరువు తదితర ప్రాంతాలలో ప్రభుత్వ నిభందనలకు విరుద్ధంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో జె.సి.బి.ల ద్వారా తొవ్వి, టిప్పర్లలో తరలించడం గత నాలుగు సంవత్సరాల నుండి విచ్చలవిడిగా జరుగుతుందని తెలిపారు. సదరు గ్రామాల పరిధిలోని రైతులు ఇళ్ల దగ్గర మెరువ చేసుకోవడం గ్రావెల్ ట్రాక్టర్ల ద్వారా తోలుకోవడం కూడా రైతులను అనుమతించడం లేదన్నారు. రైతులను అయితే ట్రాక్టర్లను ఆపి పోలీస్, ఇతర శాఖలవారు ఫైన్స్ విధిస్తున్నారన్నారు. రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అదే రాజకీయ నాయకుల అండతో పై తెలిపిన ప్రాంతాలలో అక్రమ గ్రావెల్ తవ్వకాలను, దూరప్రాంతాలకు తరలింపునకు అనుమతిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారుల తీరు సామాన్య ప్రజలపై నిరంకుశంగా వ్యవహరిస్తూ అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా గ్రావెల్ తరలింపులకు సహాయసహకారాలు అనుమతిస్తున్నారన్నారు. ఇది ఎంతమాత్రం అనుమతించడానికి వీలు లేదన్నారు. సదరు గ్రావెల్ దోపిడీని ఎన్నిసార్లు స్వయంగా పరిశీలించి, పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి పత్రికలలో ఫొటోల ద్వారా అక్రమ మైనింగ్ సమాజం దృష్టికి తీసుకొచ్చినప్పటికీ సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ చర్యలు నామమాత్రంగా కూడా లేవన్నారు. ఈ రకంగా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవ హరించడం వల్ల సహజ వనరుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతున్నదన్నారు. అధికారులకు అక్రమ మైనింగ్ అరికట్టాల్సిన భాద్యత ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై గ్రావెల్ దోపిడీకి సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మండల స్థాయిలోని రెవెన్యూ అధికారులకు, డివిజన్ స్థాయిలో ఆర్.డి.ఒ.కు స్వయంగా కలిసి, దిన పత్రికలలో ప్రచురించబడిన ఫొటోలను, వ్యాసాలను చూపించి మాట్లాడినను ఎలాంటి చర్యలు లేవన్నారు. ఇదే విధంగా గ్రావెల్ అక్రమ మైనింగ్‌ను అనుమతిస్తే సహజ వనరులకు జీవజాలానికి పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. తమరు సామాజిక భాద్యతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత వ్యక్తులపై, అధికారులపై విచారణ జరిపి సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడుతో పాటు అల్లూరు మండల టిడిపి ముఖ్య నాయకులు పలగాటి శ్రీనివాసుల రెడ్డి ఉన్నారు.



జెసితో మాట్లాడుతున్న టిడిపి నేత సుబ్బానాయుడు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



ప్రజాశక్తి-బిట్రగుంట

విశ్వనాథ రావు పేట పంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ జూనియర్ హై స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరారని వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథరావు పేటలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో సుమారు 400 మంది పైగా విద్యార్థులు చదువుతున్నారని, చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుండి వస్తున్న విద్యార్థులకు పాఠశాల వరకు బస్సు సౌకర్యం కలిగిస్తే విద్యార్థులు చదువుకు సౌకర్యం ఉంటుందని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరడంతో సమస్యను కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వివరించగా సమస్యను కావలి ఆర్‌టిసి డిపో మేనేజర్ తెలియపరచి సమస్యను పరిష్కారమయ్యేలా చూస్తానని తెలిపారన్నారు. మండల యువజన అధ్యక్షులు మేకల శ్రీనివాసులు, ఎంపిటిసి ఎకె.సుందర్‌రాజ్, గండురి శ్రీనివాసులు, తూపురి మురళి పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను ఆదరిద్దాం..

ప్రజాశక్తి-సీతారామపురం



రాష్ట్ర ప్రజలు మరోసారి జగనన్నకు అండగా నిలబడి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్, వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి పిసి అల్లూరురాజు పేర్కొన్నారు. శనివారం సీతారామపురం పంచాయతీలోని నూతి వారి కొట్టాలు, బెస్తకాలనీలలో ఆయన పర్యటించి వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలని నమ్ముకున్నారని నవరత్నాలే కాకుండా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన ప్రతిఒక్కరికీ పార్టీలకతీతంగా కులమతాలకు అతీతంగా లబ్ధిని నేరుగా ప్రజలకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. గ్రామాలలో ఏ ఇంటికి వెళ్లిన వైసిపి ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయని వాటిలబ్ధి చేకూరుతుందని సంతోషాన్ని వ్యక్తం చేస్తూ జగనన్నకు తోడుగా ఉంటామని ప్రజలు హామీ ఇస్తున్నారన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతారామపురం

జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు నెల్లూరు ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం స్థానిక రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, మద్యం బాటిళ్లను, నగదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో అమ్మకాలు జరిపిన నగదును మరుసటి రోజు క్రమం తప్పకుండా సక్రమంగా బ్యాంకులో జమ చేయాలన్నారు. బ్యాంకులో జమ చేసిన నగదు రసీదులను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం షాపులను నిర్వహించాలన్నారు. అదేవిధంగా రికార్డులలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలన్నారు. ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసే అమ్మాలన్నారు. మద్యం బాటిళ్లను ఎంఆర్‌పి కంటే ఎక్కువకు అమ్మరాదని, అట్లు అమ్మిన వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీలలో నెలకు నాలుగుసార్లు దుకాణంలోని స్టాక్‌ను తప్పకుండా స్కాన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఆదేశాలను కాదని దుకాణంలో పని చేసే సిబ్బంది వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మాల కొండయ్య ఉన్నారు.

ఫ్యాన్సీ షాప్‌లో చోరీ

ప్రజాశక్తి-ఉదయగిరి

గండిపాలెం రోడ్డులోని ఫ్యాన్సీ స్టోర్‌లో పర్సును చోరీ అయినా సంఘటన శుక్రవారం రాత్రి ఉదయగిరిలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మండల పరిధిలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి కుమారి ఫ్యాన్సీ షాపులో వస్తువులు కొనేందుకు వెళ్లగా అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు స్థానిక పోలీసులకు ఆమె ఫిర్యాదు మేరకు స్పందించిన స్థానిక ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని షాపులోని సిసి టీవీ పరిశీలించారు. అనుమానించిన ఫొటోలను గుర్తించామని ఆయన తెలిపారు. వారి ఫొటోలు మహిళా పోలీసు వాలంటీర్ గ్రూపులకు వాట్సాప్ ద్వారా పంపామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిడిపిఒ సూచనల మేరకు శనివారం ఆత్మకూరు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలను వైద్య పరీక్షల కోసం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో మూడు నుంచి ఐదు సంవత్సరాలకు గుర్తించిన పోషక సూక్ష్మ పోషక లోపాలను పిల్లలపై ప్రత్యేక వారీగా ఎదుగుదల తీసుకొచ్చేందుకు సిడిపిఒ సమక్షంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల బరువు ఎత్తు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచడంతోపాటు సరైన పోషకాహారాన్ని అందించి వయసుకు దగ్గ రీతిలో బరువు ఎత్తు పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేశవ నారాయణమ్మ, రత్నమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రమణమ్మ, సుప్రజ, సుధా, మస్తానమ్మ, వాణిశ్రీ, వేణు, కుమారి, లావణ్య, నిర్మల, తదితరులున్నారు.

కొత్తపాలెం వాసులకు 'కాకర్ల' చేయూత

ప్రజాశక్తి-జలదంకి

కొత్తపాలెం వాసులకు కాకర్ల ట్రస్ట్ అధినేత సురేష్ బాబు చేయూతనందించారు. శనివారం స్థానిక కోదండరామస్వామి ఆలయం వద్ద కాకర్ల ట్రస్ట్ సంజీవని ఆరోగ్య రథం వైద్య సేవలు అందించారు. 220 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రధాన గ్రామంలో ఇంటింటికి వెళ్లిన కాకర్ల సురేష్‌కు అక్కడే ప్రజలు సాదరంగా ఆహ్వానించారు. తిరిగి వచ్చిన వెంకటరత్నం కాలనీ, ఎస్‌టి కాలనీలలో కాకర్ల పర్యటించారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న మందాటి మాలకొండయ్యను పరిశీలించి తన వంతు సాయంగా రూ.10వేల నగదును అందజేశారు. ఎస్‌టి కాలనీలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన తలపల తిరుపతయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి రూ.10వేలు ఇచ్చారు. గడ్డివాములు దగ్ధమైన లోకిరెడ్డి మాల్యాద్రి రెడ్డి, మహేంద్రలకు పదివేల వంతున ఆర్థిక సాయం చేశారు. నియోజకవర్గంలో ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న అన్న క్యాంటీన్ సేవలు 50వ రోజుకు చేరగా, 630 మంది తమ ఆకలని తీర్చుకున్నారు. చలివేంద్రం సేవలు 68వ రోజుకు చేరుకున్నాయి. కొత్తపాలెంలో కాలనీవాసులను తమకు అండగా నిలవాలని కాకర్ల సురేష్ విజ్ఞప్తి చేశారు. టిడిపి యువనేత లోకేష్ బాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని యువతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొత్తపాలెం మాజీ ఉప సర్పంచ్ గుణపాటి వెంకటరమణారెడ్డి, వేములపాడు మాజీ సర్పంచ్ మధుర శ్రీనివాసులరెడ్డి, మార్కండేయులు, 6వ వార్డు మెంబరు జ్యోతి శ్రీనివాసులు, 3వ వార్డు మెంబర్ తలపల విజయమ్మ, గుణపాటి వెంకటేశ్వర్లురెడ్డి, పరంధామిరెడ్డి, ముప్వ శ్రీహరి, బాబుల్ రెడ్డి, గంట అశోక్, వేములపాడు టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, బ్రాహ్మణక్రాక మధుసూదన్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, పరిమి శ్రీహరి నాయుడు, సోమవరపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు మామిళ్ళ మధుమోహన్ రావు, గువ్వ శ్రీహరి, కోట సుబ్బారెడ్డి, జయంతి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

కనీస సౌకర్యాలు నిల్..

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని రామతీర్థం బ్రహ్మోత్సవాలు జూన్ 10వ తేదీ నుంచి జరుగుతున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ వారు వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున కనీస వసతులు తాగునీరు, మరుగుదొడ్లు వేసవికాలం దృష్ట్యా కనీసం షామియానాలు గానీ వేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయాలన్నా భక్తులకు కాళ్లు కాలిపోతుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ సిబ్బంది పట్టించుకోక పోవడం లేదని భక్తులు వాపోతున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాలంటే కనీసం గ్రీన్‌మ్యాచ్ పాటలు వేయాలని భక్తులు కోరుతున్నారు. భక్తులు బయట తాగునీరు బాటిల్ రూ.20 నుంచి రూ.50 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. వాటర్ ప్యాకెట్ ఆ రూ.5 నుంచి రూ.6 అమ్మడంతో భక్తులు జేబికి చిల్లులు పడుతున్నాయి. భక్తులను దుకాణదారులు అధిక రేట్లతో దోపిడీ చేస్తున్నారు. భక్తులు సరదాగా రంగులరాటం ఎక్కాలంటే భయపడుతున్నారు. దేవాలయ నిర్వాహకులు పట్టీ పట్టనట్లు ఉండడంతో వాహనాల పార్కింగ్ ప్లేస్ వాహనదారుల వద్ద నిలువ దోపిడీ చేస్తున్నారు. వీటన్నింటినీ పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇకనైనా భక్తులకు కనీస వసతులు కల్పించాలని భక్తులు కోరుకుంటున్నారు.


ల్యాబ్ పరికరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి

కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ ల్యాబ్ ఎక్విప్మెంట్‌ను సమాకూర్చామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ ప్రియ శనివారం తెలిపారు. ఇందులో ముఖ్యంగా పి ఎల్ సి ట్రైనర్ కిట్స్‌తో పాటు వాటికీ సంబంధించిన సాఫ్ట్‌వేర్, వర్కింగ్ మోడల్స్ కూడా వున్నాయని తెలిపారు. ఈ ల్యాబ్ ఈఈఈ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వారు ఇండస్ట్రీస్‌కి వెళ్లినపుడు ఈ బేసిక్స్ అవసరమని తెలిపారు. ఇందుకుగానూ ఫండ్స్ సమాకూర్చిన కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీల్ కుమార్ ప్రియ ధన్యవాదాలు తెలియజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



కాకినాడ జిల్లా రౌతుల పూడి మండల పరిషత్ అధ్యక్షురాలు విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన గిరిజన నేతలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గిరిజన మహిళ రైతులపూడి ఎంపిపి విజయలక్ష్మి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆమెను పిహెచ్‌సి ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం, ప్రశ్నిస్తే దాడికి పాల్పడడం ఎంత వరకు సమంజసమన్నారు. గిరిజన తెగకు చెందిన మహిళ ఎంపిపి స్థానంలో ఉన్నప్పటికీ ఆమెకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోగా దాడులకు పాల్పడడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లు అని ఆయన మండి పడ్డారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

విద్యార్థినులకు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి-మర్రిపాడు



జగనన్న ఆణి ముత్యాలులో భాగంగా జిల్లా స్థాయిలో బైపిసిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన నందవరం మోడల్ స్కూల్ విద్యార్థిని ముప్పాళ్ల స్వాతికి రూ.50వేల ప్రైజ్‌మనీని, కెజిబివి విద్యార్థిని మహిత 10వ తరగతిలో జిల్లాలో తృతీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించగా రూ.15వేలను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ చేతులు మీదుగా విద్యార్థినులకు అందజేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులు, కెజిబివి ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి ఇరు వురిని తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించారు.

విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్‌లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కలెక్టర్, చైర్మన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా వారి ఆదేశాల మేరకు కడపలోని డాక్టర్ వై.ఎస్.ఆర్. రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కోసం 4, 5వ తరగతులు చదవడం కోసం ఆత్మకూరు మండల స్థాయిలో శారీరక దారుఢ్య పరీక్షలు శనివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలంగాణలో ఉదయం 9గంటలకు ఎంఇఒ షేక్ నజీర్ భాషా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్‌పి పాఠశాల పి.డి.ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం జెడ్‌పి సిఇఒ చిరంజీవి పలు రికార్డులను పరిశీలించి తగు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలియజేశారు. అల్లూరు సచివాలయం -1ను పరిశీలించారు. ఎంపిడిఒ శ్రీదేవి, తదితరులున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా..

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రానికి సమీపంలో నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై అదుపు తప్పి కారు బోల్తాపడింది. వివరాల మేరకు.. బుచ్చికి చెందిన వారు మైసూరు దర్గాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ఉన్న చిన్న పిల్లలతో సహా 6మంది సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డారు.

బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఎఎస్‌పేట మండల జనసేన పార్టీ అధ్యక్షులు అక్బర్ భాషాని దుర్భాషలాడిన వైసిపి నాయకులను, నేటి వరకు అరెస్టు చేయనందుకు నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి డి.ఎస్.పి. కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఎస్‌పికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ జన సైనికులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం చేతగాక ప్రశ్నించిన వారిపై ఏదో ఒక విధంగా వ్యక్తిగతంగా దాడి చేయాలని చూడడం వైసిపి నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. ఈ క్రమంలోనే జనసేన పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ బాషాను మైనారిటీ నాయకుడు అయిన కారణంగా నువ్వు పాకిస్తాన్ వాడివని, నానా రకాలుగా దుర్భాషలాడిన విషయం అందరికీ తెలిసినదేనని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎఎస్‌పేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసి దాదాపుగా వారం గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయడం గానీ విచారించడం గానీ జరిగిన పాపాన పోలేదన్నారు. భారతీయులందరికీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించినప్పటికీ, రాష్ట్రంలో వైసిపి వారికి మాత్రమే ప్రత్యేక హక్కులు ఉన్నాయన్న చందంగా పోలీసులు తయారవడం వింత కొలిపిస్తుంది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థ ఈ విధంగా నిర్వీర్యమైపోయి చేష్టలుడికి చూస్తుండడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుందన్నారు. పిఠాపురంలో జరిగిన సభలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న నేరపూరిత రాజకీయాలపై ధ్వజమెత్తారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో జనసేన ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఏర్పడుతుందని ఈ అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. వైసిపి పాలనలో దగా పడిన ప్రజల గొంతుకై జనసేన నిరంతరం పోరాడుతూనే ఉంటుందని తెలియజేశారు. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని జనసేన తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అక్బర్ బాషా, డబ్బుగొట్టు నాగరాజ, సురేంద్ర, వంశీ, చంద్ర, పాల్గొన్నారు.



కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని వడ్లమూడిపల్లి అటవీ ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. సమాచారం మేరకు.. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.గిరిబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8600 నగదును, ఒక పందెం పుంజును స్వాధీనం చేసుకోవడంతో పాటు 10 ద్విచక్ర వాహనాలు ఒక కారును సీజ్ చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల

ఉద్యోగభద్రతకు దశలవారీ పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేసే సమయంలో, ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన హామీలను అమలు చేయాలంటూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దశల వారీ నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా విధులు నిర్వహిస్తూనే మస్టర్ కేంద్రాల వద్ద, కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రభుత్వానికి తమ వాదనలు వినిపిస్తున్నారు. టిడిపి నాయకులు నారా లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలో యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్రలకు ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తుంది. అదే సమయంలో వైసిపి నుంచి దూరంగా వచ్చిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న పాదయాత్రలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వేసవి సెలవులు ముగియడంతో తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్న నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి పలు ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పేరుతో నగదు ప్రోత్సాహం అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతూ పరీక్షల్లో ప్రతిభను కనపరిచి జిల్లాకు రాష్ట్రంలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ప్రభుత్వం సత్కార కార్యక్రమం నిర్వహణకు శ్రీకారం చుట్టింది. అగ్రిగోల్డు బాధితులకు న్యాయం చేస్తామంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, వారి సమస్యను పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే ఆందోళన బాటపట్టాలంటూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించాయి. 9 సంవత్సరాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు ప్రభుత్వాలు తమకు న్యాయం చేస్తాయంటూ ఎదురు చూస్తున్నాయని, చూసిచూసి విసిగి వేసారిపోయి ఉన్నారని, ప్రభుత్వం బాధితులకు సత్వరం న్యాయం చేయకపోతే ఆగస్టు నుంచి ఆందోళన బాటపట్టనున్నట్లు హెచ్చరించాయి.

వీక్షణం